


'శ్రీ రాజ్'



సంధానం

ఫోటో—బి ఎస్. ఎన్. మూర్తి (గుంటూరు-1)

వరహాలు లంగా, ఓణీ వేసినప్పటినించే రత్తాలు దుకాణం పెద్దదయిందని అంతా చెప్పుకుంటారు.

వరహాలు అంతా ఇంతా అందంగా ఉండేదని చెప్పటం కష్టం. తెల్లని మేఘ మాలిక కంటె తెల్లగా ఉండేది. మెత్తని గులాబీ కంటె మెత్తగా ఉండేది. మెరిసే పిటేలిందువు కంటె కాంతిగా ఉండేది.

వరహాలు మెత్తగా నవ్వేది. ఆ నవ్వుకి చిత్తయి మత్తుగా తాగేవాళ్లు, ఆ కొట్టుకు వచ్చే కస్టమర్స్. ఆ మత్తులో— మోచేతికి ఎముక లేని దానకర్ణుళ్లలా చేతిలో ఉన్న డబ్బులు వరహాలు చేతిలో పోసేవారు. కొద్దికాలంలోనే రత్తాలు బ్యాంకిది అనే బిరుదు తెచ్చుకుంది.

ఒక రోజు గాజుగ్లాసుతో తెల్లని ద్రావణ్ణి అందిస్తున్న బంగారుచేతిని చూశాడు సింహాద్రి. తల ఎత్తి చూశాడు. వరహాల నవ్వుకేవి చందమామలా వచ్చింది. బండరాయిలాంటి వాడి గుండె మైనపుముద్దలా అయిపోయింది.

'ఇది రత్తాలత్త కూతురేనా? వరాలేనా?' అనుకున్నాడు మనసులో. అట్టే ఆలస్యం చేయడం మంచిది కాదని వెంటనే వరహాల్ని ప్రేమించటం మొదలుపెట్టాడు.

"రత్తాలూ! డబ్బు గడిత్తున్నావు గదా, ఓ మేడ కట్టగూడదటే. . .?" అక్కడకు వచ్చే డైలీ కస్టమర్స్ చాలా మంది రత్తాల్ని అడిగేవారు.

"అచ్చొచ్చిన పా కుండగా మే డెందుకురా, మామా?... మా వరాలికి పెళ్లి సేసినప్పుడే మేడకూడా కట్టిత్తాన్నా. . . మొగుడూ పెళ్లాన్నీ ఆ మేడలో ఉంచుతాన్నా" అనేది సమాధానంగా.

పక్కనే ఉన్న సింహాద్రి గర్వంగా మీసం దువ్వి, వరహాలు వైపు కొరకొరా చూసేవాడు.

"రత్తాలత్తా! నే నుండగా మరెవణ్ణి తెత్తావే?"

వరహాలు మండిపడేది.

"నా బొట్టుకి నువ్వు నప్పవురా, సింహాద్రీ! అది ని న్నిట్టపడొద్దా?"

అవమానం భరించలేక పోయేవాడు సింహాద్రి.

సింహాద్రి మొద్దుబుర్రలో ఉన్న బండ ఆలోచనలన్నీ ఉపయోగించాడు, వరహాలు ప్రేమను పొందటానికి. వరహాలు వాడు కనిపించినప్పుడు చీదరించుకునేది.

వరహాలు మీద పద్దసింహాద్రి కన్నుకు కోపం కలిగింది. ఎలాగైనా ఆమెను వాడి వల్లో వేసుకోవాలని చాలా ప్రయత్నాలు చేశాడు. ఆ ప్రయత్నాల్లో ఒక ప్రయత్నమే వరహాలు హత్యకు కారణం అయింది. సింహాద్రిని టెంపరరీగా జైలుకు పంపింది.

వేసవికాలం...

రాత్రి ఎనిమిది గంటలు దాటింది. వరహాలు బేరం డబ్బులు లెక్కపెట్టి, తల్లిచేతి కిచ్చి కొత్త సరుకు బెత్తాయించి రమ్మని రత్తాల్ని ఊళ్లోకి పంపింది.

వరహాలు స్నానం చేసి, కొత్తబట్టలు కట్టుకుంటున్న సమయంలో సింహాద్రి ఇంట్లో అడుగు పెట్టి, తలుపు మూశాడు.

వరహాలుకు పట్టలేనంత కోపం వచ్చింది. చీర ఒంటినిండుగా కప్పుకుంటూ, "ఒరేయ్. ముం దిక్కడినుంచి కదలత్తావా? నేదా?" అని కసిరింది.

"వరాలూ! నాను సింహాద్రినే. ఇప్పుడు సెప్పు, నా నంటే నీ కెందు కిట్టర నేదు. . . నాకు డబ్బు నేదా?. . . పొలాలు నేవా?. . . నా కందం నేదా?. . . న న్నెందుకు పెళ్లాడవే?" నడుంమీద చేతులు వేసుకుని ముందుకు అడుగు వేశాడు.

"ఆఁ. . . నీ కందం ఉందిరా— గండుపిల్లిలాగ నీ మొగం నువ్వూ నా. . ముం దవతలకు పో... నేకపోతే. . .ఛీ!" చీదరించుకుంది వరహాలు.

సింహాద్రి శరీరంలో కోపం ఆసిడ్ మాదిరి భగ్గున మండింది. పశుత్వం నిలువునా ఆవరించింది. జేవురించిన కళ్లతో వరహాల్ని మింగినట్టు చూశాడు. ఆమె అందం వాడిని మరీ వెక్కిరించింది.

పట్టు తప్పిన వాడి శరీరం ఆమె మీదికి ఉరికింది.

వరహాలు త్రాచుపా మయింది.

శక్తినంతటిని వినియోగించి వరహాలు పళ్లతో సింహాద్రి కుత్తుక కొరికింది. మరుక్షణంలో వరహాలు గుండెల్లో వాడి కత్తి గుచ్చుకుంది.

అదే సమయంలో ఇంట్లో అడుగు పెట్టిన రత్తాలు కెవ్వున కేక పెట్టి కూతురుమీద వాలిపోయింది.

వరహాలు ప్రాణం రాకెట్ వేగంలో ఎక్కడకో వెళ్లిపోయింది.

సింహాద్రి పారిపోయాడు.

* * *

దేవుడు పదవతారాలే ఎత్తాడు. తరవాత ఓపిక లేక అవతారాలు చాలించాడు. కానీ, మనిషి తయారుచేస్తున్న డబ్బు అనంతకోటి అవతారాలు ఎత్తింది. ఇంకా ఎన్నో అవతారాలు ధరిస్తూనే ఉంది. ఉన్నవాళ్లను ఉద్ధరిస్తుంది. లేనివాళ్లను మరీ కిందికి నెట్టుతుంది.


గంగులు ఇచ్చిన డబ్బు న్యాయంగా మారి, సుందర్రామయ్య కోటుజేబులో చేరింది. అతని తలలో మెరుపులాంటి ఎన్నో కొత్త ఆలోచనలు సృష్టించింది. అతని కళ్లముందు రాత్రీ, పగలూ లా బుక్స్ పేజీలు తిప్పించింది.

ఎప్పుడూ వాదించనంత గొప్పగా సుందర్రామయ్య కోర్టులో వాదించాడు. తనకు తానే ఆశ్చర్యపోయాడు.

'సింహాద్రి నిర్దోషని, వరహాల్ని హత్య చేసింది రత్తాలేనని, అందుకు ముఖ్య కారణం వరహాలు రత్తాలు సొంత కూతురు కాదని, వరహాలు సింహాద్రితో పెళ్లికి ఇష్టపడలేదని, సింహాద్రిమీదున్న అభిమానం కొద్దీ తన మాట వినలేదనే ఉక్రోషంతో రత్తాలు పొడిచిందని చాలా నీటుగా సుందర్రామయ్య వాదించాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెదిరిపోయాడు. అతనితో ఆర్గ్యూ చేయలేక తల పట్టుకొని కూర్చుండిపోయాడు.

## పోదాం పోదాం పైపైకి . . .

ఫోటో—పి. బి. ఎస్. రెడ్డి (నెలూరు)



జడ్జీగారు ముసలిదాన్ని ఏమైనా ఉంటే చెప్పుకోమన్నారు.

"నా నేం సెప్పుకుంటాను, బాబూ! ఈ న్నేయంగాని, అన్నేయంగాని నా వరాల్ని బతికిస్తాయా?. . . బతికించ నేవు. . . అది బతకనేనప్పుడు నా నెందుకు, బాబూ!... బాబూ. . . నన్నురేయించు. నానూ దాని కాడికే పోతాను. . . నా కూతుర్ని నానే సంపుకున్నాను. . . నన్నురేయించు, బాబూ... నన్ను సంపించు, బాబూ.. నీకు పున్నెం ఉంటాది." రత్తాలు వలవలా ఏడ్చింది.

జడ్జీగారు అడిగినా, ప్రాసిక్యూటరడిగినా ఇంతకంటె మరేం చెప్పలేదు. ఎండిపోయిన ఆ ముసలిగుండెలో బతకాలనే ఆశా లేదు; తన కూతురు బతుకును బలిచేసిన వాళ్ల బతుకులు నాశనం చేయాలనే ఆవేశమూ లేదు.; చెయ్యని నేరాన్ని తన మీద రుద్దారనే చింత అంతకంటే లేదు. తన బ్రతుకు తెల్లారటానికి సరైన మార్గం చూపిన సుందర్రామయ్యకు మాత్రం చెయ్యెత్తి దండం పెట్టింది.

జడ్జీగారు రత్తాలుకు యావజ్జీవితపు ఖైదుశిక్ష విధించారు. రత్తాలునుపోలీసులు జైలుకు తీసుకుపోయారు. సింహాద్రిని విడుదల చేశారు.

సుందర్రామయ్య కళ్లు జ్యోతుల్లా వెలిగాయి. గంజిపేట జంక్షన్ దాటేవరకు సుందర్రామయ్య కారుతో పరుగెత్తాడు సింహాద్రి. వాడిలో సంతోషంసముద్రంలా పొంగింది.

హాల్లో న్యూస్‌పేపర్ చదువుతున్న సుందర్రామయ్య సింహాద్రిని చూసి— "ఏరా, సింహాద్రీ?" అన్నాడు.

"ఏం లేదు, బాబూ. . . మీకు బగుమానం ఇచ్చుకుందామని. . ." సింహాద్రి నసిగాడు.

"ఏమిట్రోయ్, ఆ బహుమతి?" పేపర్ పక్కన పెట్టి నవ్వుతూ అడిగాడు.

"బాబూ, మీరు గనక నా పేనాలు కాపాడారు. మరోడయితే నాబం నేకపోను, బాబూ...ఈ గొలుసు సుంచండి, బాబూ!" జేబునుండి ఓ లాకెట్ తీసి ఇచ్చాడు.

సుందర్రామయ్య క్షణంలో అదోలా అయిపోయాడు.

"సింహాద్రీ! ఈ లాకెట్టు. . ."

"సచ్చిన వరాలదండీ. . ."

"అంటే?"

"అది సచ్చినప్పుడు తెంపుకొచ్చినానండి. . .బాబూ, ఆ గొలుసు సేనుకుని నా కురికేది. . .అసలు ఆ గొలుసుతోటె ఆ గుంట రత్తాలికి దొరికిందంట,బాబూ! ఎక్కడంటే. . . ఆఁ! సీతమ్మోరు దార కాడంట, బాబూ. . ."

'ఒరేయ్, సింహాద్రీ! పో బయటకు. నువ్వు. . . నువ్వు. . .' —ఎంతో కోపంగా అరవా లనుకున్నాడు సుందర్రామయ్య. కానీ, అతని నోరు పెగల్లేదు. ముఖం వివర్ణమై పోయింది.

లాకెట్టు టేబులుమీ దుంచి సింహాద్రి వెళ్లిపోయాడు.

పత్రాలు గేళ్ల కాలండర్ల కాగితాలు రెపరెపమంటూ సుందర్రామయ్య మస్తిష్కంలో వెనక్కి తిరిగాయి.

కార్తీక మాసం. . .ఆఖరి వారం. . . సీతమ్మ దార పిక్నిక్. . .తానూ, లక్ష్మీ, బేబీ, పక్కింటివాళ్లూ — అంతా కొండ మీదికి వెళ్లారు. దూరంగా ఉన్న సముద్రం. . . ఏరాడకొండ. . . నిండు గర్భిణీలాంటి టౌన్ — ఆహ్లాదకరంగా కనిపించాయి. ఎన్నో ఫోటోలు తను తీశాడు.

పందాలు వేసుకొని, వడివడిగా దార గట్టువెంట నడిచారు. కబుర్లు చెప్పుకుంటూ 'పిక్నిక్ స్పాట్' చేరుకున్నారు. కాస్సేపటిలో బేబీ కనిపించలేదు.

లక్ష్మి కెవ్వుమంది.

తను అదిరిపోయాడు.

తోటంతా గాలించారు. కొన్ని వేల యాత్రికులతో నిండిన ఆ తోటలో మూడేళ్ల బేబీ కనిపించలేదు. . . తరవాత మరెప్పుడూ కనిపించలేదు.

"ఛీ!" సుందర్రామయ్య కళ్లు వర్షించాయి. మూడేళ్ల బేబీ రూపం సుందర్రామయ్య 'మనిషి' మీద సమ్మెట పోటు వేసింది. అతని హృదయం కెవ్వుమంది. మానవత్వం, అనురాగం. . . ఒక్కసారిగా విభిన్న కోణాల నుండి దూసుకువచ్చి అతని ముందు వెక్కిరింపుగా నిలిచాయి.

తను ఎవర్ని గెలిపించాడు?

ఎవరికి శిక్ష వేయించాడు?

ఉరికంబం నుండి తీసిన నేరస్థుని తలలా సుందర్రామయ్య ముఖం వాలిపోయింది.

అతను మరెప్పుడూ కోర్టుకు వెళ్లలేదు. ★